సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం : 27 : జూలై : 2024



వేటకు వరద పోటు

వారం రోజులుగా మత్స్యకారులు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో 8 రోజులుగా వేట సాగడం లేదు. 8లో ▸



ప్రాణం తీసిన వివాదం

ఇద్దరి బంధువుల మధ్య పొలంలో నీటికి సంబంధించి వివాదం ఓ ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది. పెదవేగి మండలం కూచింపూడిలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. 8లో ▸



ఉద్యోగాల ఆశ చూపి మోసం

కాంట్రాక్టు అధ్యాపకురాలు ఘరానా మోసానికి పాల్పడింది. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.30 లక్షల వసూలు చేసి ముఖం చాటేసింది. 8లో ▸

న్యూస్‌రీల్

ఆర్డీవో శ్రీనివాసులురాజు బదిలీ



శ్రీనివాసులురాజు

భీమవరం: భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు కుప్పం బదిలీ అయ్యారు. కడప నుంచి వచ్చిన ఆయన భీమవరం ఆర్డీవోగా గత ఏడాది అక్టోబర్ 25న బాధ్యతలు చేపట్టారు.

ఆగస్టు 17న నిట్ స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ ఆరో స్నాతకోత్సవం ఆగస్టు 17న నిర్వహించనున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి యుజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు స్నాతకోత్సవంలో సర్టిఫికెట్లు పొందడానికి జులై 31 లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

రైతులను ఆదుకోవాలి

భీమవరం: భారీ వర్షాలు, వరదల కారణంగా వరి నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీ రామరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాచరణ సమితి నాయకులు పాలకోడేరు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురైన వరి నారుమళ్లు, నాట్లను పరిశీలించారు. అనంతరం మురళీరామరాజు భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటించగా వరి నాట్లువేసిన భూములతో పాటు నారుమళ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు తిరిగి నారువేసి నాట్లు వేయాలంటే తీవ్ర జాప్యం జరుగుతుందని తద్వారా దాళ్వా పంటపై ప్రభావం చూపుతుందన్నారు. అందువల్ల నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్న రైతులకు స్వల్పకాలిక వరి వంగడాల విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

భీమవరం: విద్యుత్ ఉద్యోగులకు అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం భీమవరంలో ఏర్పాటుచేసిన యూనియన్ జిల్లా ముఖ్యకార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 24 వేల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, 1999 తరువాత సంస్థలో చేరిన ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, వేతన సవరణ బకాయిలు చెల్లించాలని కోరారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఈఎస్‌జీ కృష్ణంరాజు అధ్యక్షత వహించగా భీమవరం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరాజు, ఏలూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాస్, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరాలో విఫలం

ఏలూరు(టూటౌన్): ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్పి కార్మికులకు ఆశ కల్పించిందని, ఆచరణలో ఉచిత ఇసుక అందించడంలో విఫలమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు విమర్శించారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయు జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఉచిత ఇసుక ఎవరికీ అందడం లేదని కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని, వాటిని వెంటనే అమలు చేసి సంక్షేమ పథకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అధిక పొగాకుపై పెనాల్టీ మాఫీ

కొయ్యలగూడెం: అధికంగా ఉత్పత్తి చేసిన పొగాకు పంటపై జీరో పెనాల్టీ అమలు చేస్తామని వర్జీనియా టొబాకో బోర్డ్ ఓఎస్‌డీ (విజిలెన్స్) రామారావు పేర్కొన్నారు. శుక్రవారం కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ఏఎస్ గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పొగాకు రైతులతో సమావేశం నిర్వహించి లైసెన్స్ కలిగిన రైతులు అధికంగా ఉత్పత్తి చేసిన పొగాకు విక్రయాలపై సెస్సు రద్దు చేయాలని కేంద్రం ఆదేశించిందన్నారు. ఇది ప్రస్తుత సంవత్సరానికి మాత్రమే వర్తిస్తుందని, భవిష్యత్తులో అధికంగా ఉత్పత్తి చేసిన పొగాకుపై జరిమానా విధిస్తారన్నారు.

గ్యాస్ సబ్సిడీ పక్కదారి

- వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు
- యథేచ్ఛగా వాడుతున్న హోటల్స్, స్వీట్ స్టాల్స్, బేకరీలు
- రోజుకు రెండు వేల వరకు అక్రమంగా తరలింపు
- ఒక్కో సిలిండర్‌పై కేంద్రం సబ్సిడీ రూ.458
- రోజుకు ప్రభుత్వానికి రూ. 9.16 లక్షల నష్టం

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు	జనరల్ కనెక్షన్లు	దీపం కనెక్షన్లు	ఉజ్వల కనెక్షన్లు	సీఎస్ఆర్ కనెక్షన్లు	5 కేజీల కనెక్షన్లు
6,21,626	4,02,335	1,83,183	27,420	8,528	160



డొమెస్టిక్ సిలిండర్లు

సాక్షి, భీమవరం: వంట గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార అవసరాలకు తరలిపోతున్నాయి. కళ్ల ముందు ఈ అక్రమాలు కనిపిస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం పలు అనుమానాలు తావిస్తోంది. అలాగే ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ)కి 20 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా, హెచ్‌పీసీ ఏజెన్సీలు 18, బీపీసీ ఏజెన్సీలు నాలుగు ఉన్నాయి. వీటి పరిధిలో 6,21,626 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఆయా గ్యాస్ ఏజెన్సీల ద్వారా జిల్లాలో రోజుకు పది వేల డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు అంచనా. 14.2 కిలోల డొమెస్టిక్ (గృహావసరాలకు) సిలిండర్‌ను సబ్సిడీపై కేంద్ర ప్రభుత్వం రూ.842కు అందజేస్తుంది. కిలో గ్యాస్ ధర రూ.59.29లు. వాణిజ్య అవసరాలకు సంబంధించిన కమర్షియల్ సిలెండర్లకు ఈ రాయితీ వర్తించదు. 19 కేజీల కమర్షియల్ సిలిండరు ధర ప్రస్తుతం రూ.1,740. కిలో రూ. 91.58. డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ల మధ్య కిలో గ్యాస్‌కు రూ.32.29 వరకు వ్యత్యాసం ఉంది. డొమెస్టిక్ సిలిండర్‌తో రూ.458 ఆదా అవుతుండటంతో పెద్ద ఎత్తున వ్యాపారులు వీటిని దారి మళ్లిస్తున్నారు.

కేవలం 300 కమర్షియల్ సిలిండర్ల అమ్మకం

జిల్లాలో హోటళ్లు, స్వీట్ షాపులు, బేకరీలు, కర్రీ పాయింట్లు, ఇతర వ్యాపార సంస్థలు ఐదు వేలకు పైగానే ఉన్నాయి. వాటిలో వంటల తయారీకి కమర్షియల్ సిలిండర్లను వినియోగించాలి. అందుకోసం రోజుకు సుమారు రెండు వేలకు పైనే కమర్షియల్ సిలెండర్లు అవసరమవుతాయి. ప్రస్తుతం ఏజెన్సీల నుంచి రోజుకు 300 వరకు మాత్రమే కమర్షియల్ సిలిండర్లు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. మిగిలినవి డొమెస్టిక్ సిలిండర్లు దారిమళ్లిస్తున్నారు. రోజుకు రెండు వేల డొమెస్టిక్ సిలిండర్లు దారి మళ్లడం ద్వారా ఒక్కో సిలిండరుపై సబ్సిడీ రూ. 458 చొప్పున ప్రభుత్వానికి రోజుకు రూ.9.16 లక్షల నష్టం వాటిల్లుతోంది.

చూసీ చూడనట్టుగా ఏజెన్సీలు

గ్యాస్ కంపెనీల మధ్య ఉన్న పోటీ వ్యాపారులకు వరంగా మారింది. గ్యాస్ ఏజెన్సీలు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటంతో గృహావసరాల సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించేస్తున్నారు. కార్డుదారులకు గతంలోని పరిమితిని ఎత్తివేసి నెలకు ఒకటి చొప్పున ఏడాదికి 12 సిలెండర్లు ఇస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో గ్యాస్ వినియోగం తక్కువగా ఉండటాన్ని అనుకూలంగా మలచుకుంటున్నారు. చిరు వ్యాపారాలు చేసుకునే పేదవర్గాల వారిని అటుంచితే పెద్దపెద్ద హోటళ్లు, స్వీట్స్‌షాపులు, బేకరీలు, కర్రీపాయింట్లు ఎక్కడపడితే అక్కడ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

తూతూమంత్రంగా దాడులు

గ్యాస్ భారం తగ్గించుకునేందుకు సంపన్న వర్గాల వారు సబ్సిడీ వదులుకోవాలని గతంలో కేంద్రం కోరగా సబ్సిడీ సిలిండర్లే దారిమళ్లిపోతుండటం గమనార్హం. ప్రభుత్వానికి ఎంతో నష్టం వాటిల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు ఉంటున్నారన్న విమర్శలున్నాయి. గత ఏడాది జిల్లాలో నాలుగు హోటళ్లపై దాడులు చేసిన అధికారులు 18 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత మళ్లీ ఎక్కడ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఈ విషయమై సివిల్ సప్లయిస్ జిల్లా అధికారిణి సరోజను సంప్రదించగా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగించకూడదని, తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధరలు తగ్గించకపోతే రోడ్డెక్కుతాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా రైతు సంఘం నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో కస్టమ్స్ చార్జీలు భారీగా తగ్గిస్తూ ప్రకటన చేసిందని, ఆ మేరకు ఫీడ్ కంపెనీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీలు ధరలు తగ్గించాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పూలపల్లి ఆర్‌ఆర్‌ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆక్వా రైతుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15 నాటికి ధరలు తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కంపెనీలు ధరలు తగ్గించకపోతే రోడ్లపైకి వచ్చి పోరాటం చేస్తామని, క్రాప్ హాలిడే కూడా ప్రకటించడానికి వెనుకాడేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఆక్వా రైతులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అనే తేడా లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో కూడా సబ్సిడీ ఉండేదని, దానిని కూడా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రొయ్యలు విదేశీ మార్కెట్‌కు ఎగుమతి చేయడం కన్నా ఇక్కడ విక్రయించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆక్వా సంఘ సభ్యులు బోణం చినబాబు, త్సవటపల్లి నాగభూషణం, కోడి విజయభాస్కర్, కర్నేని గౌరునాయుడు, జాన్‌రాజు, యువరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనపై పోరాడతాం



భీమవరంలో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

భీమవరం: కూటమి ప్రభుత్వం రెండు నెలల కాలంలో అనేక అరాచకాలు సృష్టించడమేగాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు మంగళం పాడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రాయప్రోలు శ్రీనివాసమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా శుక్రవారం భీమవరం పట్టణంలోని ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 52 రోజుల్లోనే అనేక అత్యాచారాలు, హత్యలు, దాడులు జరిగాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు నష్టపోయారన్నారు. వైఎస్సార్‌సీపీని టార్గెట్‌గా చేసుకుని చేస్తున్న దాడులను దేశం మొత్తం ఖండిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ గొప్పగా ప్రచారం చేసుకుని.. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను గాలికొదిలేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తల్లికి వందనం పథకానికి ఈ ఏడాది ఎగనామం పెట్టి.. వచ్చే ఏడాది నుంచే అమలు అంటున్నారని విమర్శించారు. ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం అని చెప్పినా వేటినీ అమలుచేసే ఉద్దేశం ప్రభుత్వానికి కనపడటం లేదన్నారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు అమలయ్యేవరకు ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పాలవెల్లి మంగ, పాలపర్తి జోనా, పంతం సతీష్, గుంటి ప్రభు, పెచ్చెట్టి ప్రసాద్, పతివాడ రాజేంద్ర, జట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే లంక గ్రామాలు

యలమంచిలి: గోదావరిలో వరద స్థిరంగా కొనసాగుతోంది. వరుసగా నాలుగో రోజు లంక గ్రామాలు వరదలోనే గడపాల్సి వచ్చింది. బాడవ, లక్ష్మీపాలెం, కనకాయలంక, పెదలంక గ్రామాల ప్రధాన రహదారుల పైకి వరద నీరు చేరుకుంది. దొడ్డిపట్ల ఏటిగట్టు దిగువున ఉన్న మత్స్యకార కాలనీ ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. కనకాయలంక కాజ్‌వేపై ప్రమాదకర స్థాయిలో వరద నీరు ప్రవహిస్తుంది. ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాలలో వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అడ్వాన్స్ రేషన్ బియ్యం మాత్రమే పంపిణీ చేయడంపై వరద బాధితులు నిరసన తెలుపుతున్నారు. కూలీలంతా ఇళ్లకే పరిమితమైన నేపథ్యంలో బియ్యం మాత్రమే ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నిత్యావసరాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు. వరద వలన పచ్చగడ్డి దొరకని నేపథ్యంలో పశువులకు పశుగ్రాసం పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కనకాయలంకలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ పర్యటించారు. వరద బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి వరద బాధితులను ఆదుకోవాలని గోపి డిమాండ్ చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, నాయకులు పులి సుబ్రహ్మణ్యం, ఎన్నాబత్తుల సుధీర్, వలవల నరసింహమూర్తి, మద్ది ప్రభాకర్, గణపతి తదితరులున్నారు.



యలమంచిలి మండలం లక్ష్మీపాలెంలో వరదముంపులో మత్స్యకార కాలనీ



కనకాయలంకలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపికి గోడు చెబుతున్న బాధితులు



కనకాయలంక కాజ్‌వే సమీపంలో వరద

తక్కువ చార్జీలతో ఉచిత ఇసుక



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ఉచిత ఇసుకను తక్కువ రవాణా చార్జీలతో అందించడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం వెలగపూడి ఐదో బ్లాక్ నుండి గనులు భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఇసుకపై ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేయాలని చెప్పారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక అందుబాటులో లేదని, తూర్పుగోదావరి రావులపాలెం నుంచి కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డీసిల్టింగ్ పాయింట్లు వినియోగంలోనికి తీసుకురావడానికి పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదలను పంపామన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి మెరుగైన కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యువతకు ఉద్యోగ అవకాశాలు, కువైట్‌కు వెళ్లే మహిళల భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వివిధ కంపెనీలు, పరిశ్రమల ప్రతినిధులతో త్వరలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. గల్ఫ్ వెళ్లే మహిళల భద్రతపై జిల్లాలో రిజిస్టర్ అయిన, రిజిస్టర్ కానీ ఏజెంట్లతో ఆగస్టు మూడో వారంలో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

వైఎస్సార్ విగ్రహ ఏర్పాటు అడ్డగింత

- స్తూపం ధ్వంసం కావడంతో కొత్తది నిర్మిస్తుండగా అడ్డుకున్న వ్యాపారి
- కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో అడ్డగోలుగా వాగ్వాదం



కొయ్యలగూడెం మెయిన్ సెంటర్లో ఆందోళన చేస్తున్న వైఎస్సార్ అభిమానులు



15 ఏళ్ల నుంచి ఉన్న వైఎస్సార్ విగ్రహం

కొయ్యలగూడెం: వైఎస్సార్ విగ్రహానికి నిర్మిస్తున్న స్తూపాన్ని అడ్డుకున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానిక వ్యాపారికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మద్దతుగా అభిమానులు పార్టీలకు అతీతంగా నిలబడ్డారు. కొయ్యలగూడెంలో శుక్రవారం మధ్యాహ్నం గణేష్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి స్థూప నిర్మాణం చేపట్టారు. స్తూపం ధ్వంసం కావడంతో దాని స్థానంలో కొత్తది నిర్మించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు సిద్ధమయ్యారు. స్తూపంపై వైఎస్సార్ పాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండగా స్థానిక వ్యాపారి అడ్డుకున్నాడు. విగ్రహం తమ కాంప్లెక్స్‌కి అడ్డు అంటూ వాదించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నాయి. ఆ స్థలం సుమారు 50 సంవత్సరాల క్రితమే కాంగ్రెస్ పార్టీకి చెందినదిగా ఆధారాలు ఉన్నాయని అందుకు సంబంధించి పత్రాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కొనసాగిందని శ్రేణులు తెలిపాయి. క్రమేణా మూడు సెంట్ల స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టిన వ్యక్తి కబ్జా చేశాడని విగ్రహం ఉన్న స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు ఆరోపించారు. దీనిపై స్థానిక సర్పంచ్ ముప్పిడి విజయకుమారి మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహాన్ని దశాబ్దన్నర క్రితం నిర్మించామని చెప్పారు. తిరిగి అదే స్థలంలో నిలబెడతామని అందుకు వెనుకాడబోయేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎం.చినబాబు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో శుక్ర వారం అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తు న్నారనే సమాచారంతో సివిల్ సప్లయి, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి నుంచి రాజానగరానికి బొలెరో వాహనంలో 19.40 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకు న్నట్లు సివిల్ సప్లయి డీటీ వైవీ లక్ష్మీకుమారి తెలి పారు. దేవులపల్లికి చెందిన కొలుకులూరి బాలా జీ, యడ్లపల్లి రాము, దేవరపల్లి రామకృష్ణ, రాజానగరానికి చెందిన సత్తిబాబుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో లక్కవరం ఎస్సై సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌పై కేసు నమోదు

భీమవరం: బంగారపు గొలుసు అపహరణపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం వెంక టేశ్వరరావు చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ మేడి చర్లకు చెందిన ముదునూరి విజయలక్ష్మి గత మే నెలలో భీమవరం పట్టణం నరసయ్య అగ్ర హారంలోని పుట్టింటికి వచ్చింది. తిరిగి మే 4వ తేదీన ఆమె హైదరాబాద్ వెళ్లేందుకు రోడ్డుపై నడిచివెళుతుండగా మోటారుసైకిల్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు వచ్చి ఆమె మెడలోని కాసున్నర బంగారపు గొలుసును లాక్కుపోయారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన బాధితురాలు పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు.

చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మయ్య

చాట్రాయి: ఓ ఇంట్లో చోరీ చేసి దోచుకెళ్లిన బం గారపు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య తెలిపిన వివరాలివి. మండలంలోని చనుబండ శివారు సూరంపాలెం గ్రామానికి చెందిన షేక్ రమాదేవి ఈ నెల 25న ఇంటికి తాళం వేసి ఎన్ టీఆర్ జిల్లా విస్సన్నపేట వెళ్లింది. తిరిగి ఉదయం 11 గంటలకు ఇంటికి చేరుకునేరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగల కొట్టి ఇంట్లో ఉన్న రూ.10 వేలు, బంగారపు ఆభరణాలు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేప ట్టారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో చాట్రాయి గ్రామానికి చెందిన కూరాటి సిద్ధార్థ, సాధు మధుబాబు, కోలేటి హేమంత్‌లను గ్రామం బయట అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బంగారు నాను తాడు, నల్లపూసల గొలుసు, చిన్న ఉంగరం 5 జతల చెవి దుద్దులు, రూ.9200 స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. ఈ సందర్భం గా ఎస్సై స్వామి, ఎన్ గజపతిరావు, ఎం శ్రీని వాసరావు, వి.విష్ణుకుమార్, కె గిరిబాబులను నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య తదితరులు అభి నందించారు.

వేటకు వరద పోటు

- అధిక వర్షాలతో గోదావరికి పోటెత్తుతున్న వరద
- తీరంలో నాటు పడవలకు 8 రోజులుగా లంగరు
- సీజన్‌లోనూ మత్స్యకారులకు గడ్డు పరిస్థితులు



గోదావరి తీరంలో నాటు పడవలకు లంగరు వేసిన దృశ్యం

నరసాపురం: గత వారం రోజులుగా ప్రకృతి కన్నెర్ర చేయడంతో మత్స్యకారులు గడ్డు పరిస్థితి ఎదు ర్కొంటున్నారు. అధిక వర్షాలు, వరద నీటితో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో మత్స్యకారులు నాటు పడవలను తీరానికి తీసుకొచ్చి లంగరు వేశారు. దీంతో గత 8 రోజు లుగా గోదావరిలో వేట సాగడం లేదు. ఇప్పు డిప్పుడే గోదావరి నీటిమట్టం తగ్గడం ప్రారంభమై నా.. మరో రెండు, మూడు రోజులపాటు గోదావ రిలో నాటు పడవలపై వేట సాగే అవకాశం లేదు. జూలై మాసం చివరి రోజులు నడుస్తున్నాయి. ప్రస్తుతం గోదావరిలో చేపలు ఎక్కువగా లభించే ఈ సీజన్‌లో వేట సాగకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వర్షాలు పడుతున్నాయి. ముఖ్యంగా సముద్రతీర ప్రాంతం కావడంతో నరసాపురంలో గరిష్ఠస్థాయిలో వర్షపాతం నమోదైంది. గోదావ రినీరు సముద్రంలో ఈ సమీప ప్రాంతంలోనే కల వడంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో గోదావరి ఉధృతం గా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో నాటు పడవలపై గోదావరిలో వేట ప్రమాదకరంగా మారింది. దీం తో గత్యంతరం లేని పరిస్థితుల్లో మత్స్యకారులు వేటకు విరామం చెప్పారు.

సంప్రదాయ వేటపైనే ప్రభావం..

సముద్రంలో పెద్దపెద్ద మెకనైజ్డ్ బోట్లపై వేట సాగు తుంది. తుపాన్ల సమయంలో తప్పితే, ఇలాంటి అధిక వర్షాలు, వరదల ప్రభావం సముద్రంలో సాగే వేటపై ఉండదు. అయితే ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 19 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్న నరసాపురం, మొగల్తూరు మండలాల్లో చెక్కనావ లపై గోదావరిలో వేట సాగించే మత్స్యకారులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. నరసాపరం పట్టణాన్ని ఆనుకుని ఉన్న గోదావరిలో సుమారు 1500 మంది మత్స్యకారులు చెక్కబోట్లపై సంప్రదాయ వేట సాగి స్తారు. గోదావరిలో దొరికే మత్స్యసంపద ఎక్కువగా లోకల్ మార్కెట్‌లో విక్రయాలు జరుగు తాయి. కొన్ని రకాల చేపలు మాత్రమే ఎగుమతులు జరుగుతాయి. మత్స్య కార్మికుల్లో అత్యంత నిరుపే దలు ఇప్పటికీ ఇలా గోదావరిలో సంప్రదాయ వేట సాగిస్తుంటారు. అధిక వర్షాల ప్రభావం పూర్తిగా వీరిపై పడింది. పైగా జూలై, ఆగస్టు మాసాల్లో చేపలు ఎక్కువగా దొరికే సమయం. సీజన్‌లో వేటకు విఘాతం కలిగినట్టయ్యింది.

వారం రోజులుగా వేట సాగడం లేదు

నేను చెక్కనావపై గోదావరిలో వేట సాగిస్తాను. వారంరోజుల నుంచి వర్షాలు పడు తుండడంతో వేట సాగడం లేదు. వరద ఉధృ తంగా ఉండడంతో గోదావరిలో వల వేయడం కష్టంగా ఉంది. ఇలాంటి సమయంలో వలలు నీటిలో వదిలితే పాడైపోతాయి.

– మైల వీరాస్వామి, నరసాపురం

ఇంకా సమయం పడుతుంది

గోదావరి సముద్రంలో ఇక్కడే కలుస్తుంది కాబట్టి ఎగువ నుంచి వచ్చే నీరు తగ్గాలి. వర్షాలు తగ్గినా.. వరద నీరు రాక కాస్త తగ్గినా ఇక్కడ గోదావరిలో వరద తగ్గడానికి సమయం పడుతుంది. కాబట్టి మరికొన్ని రోజులు గోదావరిలో వేట సాగదు.

– కొల్లు రాంబాబు, నరసాపురం

ప్రశాంతంగా హార్టీసెట్



ఉద్యాన వర్సిటీలో హార్టీసెట్ రాస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం హార్టీసెట్ 2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. వెం కట్రామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీ పురం, చినలాటరిపి ఉద్యాన కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 266 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హార్టీ సెట్ ర్యాంకుల ఆధారంగా సుమారు వంద సీట్లకు బీఎస్సీ హానర్స్ హార్టీకల్చర్ కోర్సులో ప్రవేశం పొందుతారు. పరీక్ష నిర్వహణలో వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివా సులు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ పద్మావతమ్మ, కం ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ స్వామి, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడు లేక.. ఆదుకునే నాథుడు లేక



కారం దేవమ్మ మృతదేహం

వేలేరుపాడు: గూడు లేక, ఆదుకునే నాథుడు లేక ఓ వృద్ధు రాలు అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందిం ది. ఇటీవల పెద్దవాగు ప్రాజెక్ట్ తెగిపోవడంతో వేలేరుపాడు మండలంలోని అల్లూరినగర్ గ్రామానికి చెందిన కారం దేవమ్మ (85) ఇల్లు ఈనెల 18న నీటిలో కొట్టుకుపోయింది. ఆమె కుమారుడు లక్ష్మయ్య ఇల్లు సైతం కొట్టుకు పోయింది. ఈ ప్రాంతంలో పునరావాస కేం ద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం తో అప్పటినుంచి ఆమె గత తొమ్మిది రోజు లుగా వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ.. చలికి వణుకుతూ ఆ ప్రాంతంలోనే తీవ్ర ఇబ్బందులు పడింది. దీనికితోడు గురువారం నుంచి ఆమె వాంతులు, విరేచనాలతో బాధప డుతోంది. కనీసం సమీపంలో ఉచిత వైద్య శిబిరం కూడా లేకపోవడంతో ఆ వృద్ధురాలు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. తాము గత తొమ్మిది రోజులుగా బాధపడు తున్నా ప్రభుత్వం నుంచి ఏవిధమైన వరద సాయం అందలేదని, దీంతో తన తల్లి మృతి చెందిందని లక్ష్మయ్య కన్నీరుమున్నీరయ్యాడు.

పరిశ్రమల కార్మికులకు వేతన చట్టం అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



రైస్‌మిల్ కార్మికుల రాష్ట్ర విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

భీమవరం : పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమవరం ప్యాడి అండ్ రైస్ మర్చంట్ హాల్లో రైస్‌మిల్ కార్మికుల రాష్ట్ర విస్తృత సమావేశం యూనియన్ జిల్లా కార్యదర్శి బి వాసుదేవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమా వేశంలో నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాల కులు, యాజమాన్యాల విధానాలతో వ్యవసాయ రంగ ఆధారిత పరిశ్రమ రైస్‌మిల్లులో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం, కార్మిక చట్టాలు అమలు జరగడంలేదని పీఎఫ్ ఈఎస్ఐ గ్రాడ్యుటీ కనీస చట్టాలు కూడా నేటికీ అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద త్వరలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటిం చారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన నాయకులు హనుమంతు కోటేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, కె తవిటి నాయుడు, కె సత్యనారా యణ పాల్గొన్నారు.

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

భీమవరంలో నిర్వహించిన రైస్‌మిల్ కార్మికుల రాష్ట్ర విస్తృత సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా బి వాసుదేవరావు, కమిటీ సభ్యులుగా హెచ్ ఈశ్వరరావు, ఎం సుందర్‌బాబు, ఎం ధన రాజ్, బి శ్రీను, గుబ్బల సత్యనారాయణ, వి రత్తయ్య, ఎం ఎర్రమల, ఎం చంద్రయ్య ఎన్నిక య్యారు.

కూచింపూడిలో దారుణహత్య

ప్రాణం తీసిన నీటి వివాదం



హత్యకు గురైన కలపాల ఏసు

దెందులూరు: ఇద్దరి బంధువుల మధ్య పొలంలో నీటికి సంబంధించి చెలరేగిన వివాదం కాస్త ఓ ప్రాణాన్ని పొట్టనపెట్టుకుంది. ఈ ఘటనలో ఏలూరు జిల్లా పెదవేగి మండలం కూచింపూడి గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. భూ వివాదం కారణంగా బంధువుల మధ్య ఇలాం టి సంఘటన చోటు చేసుకోవడంతో సర్వత్రా చర్చ నీయాంశమైంది. పెదవేగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. బాధి తుల సమాచారం మేరకు పెదవేగి మండలం కూచింపూడి గ్రామంలో కలపాల ఏసు (45) వ్యవ సాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన సరిహద్దు పొలం దూరపు బంధువు కావడం అత నితో పొలంలో నీటి సరఫరాకు సంబంధించి గొడవలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి పొలంలో ఉండగా ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ గొడవలో దూరపు బంధువుతో పాటు మరికొందరు ఏసు కుటుంబంపై దాడి చేశారు. ఇదే సందర్భంలో దూరపు బంధువు ఏసుపై పామాయిల్ గెలలు నరికే కత్తితో దాడి చేసి దారుణ హత్యకు తెగప డ్డాడు. ఈ దాడిలో ఏసు భార్య రత్నకుమారి, తమ్ముడు అచ్చిరాజు కూడా తీవ్ర గాయాలపాల య్యారు. వారిద్దరిని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీ హెచ్‌కు తరలించారు. కలపాల ఏసుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనతో కూచింపూడి గ్రామంలో ఏసు కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు భార్య, తమ్ముడు కోలుకున్న తరువాత వారు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ హత్యకు సంబంధించి భూ వివాదమైన, మరే ఇతర కారణా లేమైనా ఉన్నాయేమోనని వాటిపై కూడా దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆనంద్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

భీమవరం : ప్రభుత్వం మారడంతో తనని ఉద్యోగం నుంచి తొలగిస్తారనే ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడిన పల్నాడు జిల్లా చిలక లూరిపేట మండలం గోపాలరావుపాలెం గ్రామ ఎఫ్ఏ ఆనంద్ కుటుంబానికి జిల్లా జేఏసీ ఆధ్వర్యం లో రూ.50 వేలు సహాయం అందించినట్లు జేఏసీ చైర్మన్ ఎం బాపూజీ శుక్రవారం భీమవరంలో విలేక ర్లకు తెలిపారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లా డుతూ ఈ నెల 11వ తేదీన ఆనంద్ పురుగులమం దు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు కాగా కుటుంబం ఆనంద్ ఉద్యోగంపైనే ఆధారపడి జీవిస్తుందన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆనంద్ కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఎటువంటి సహకారం అందే అవ కాశం లేకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లా ఉపా ధిహామీ పథకం సిబ్బంది స్పందించి రూ: 50 వేలు సమకూర్చి బాధితుని కుటుంబానికి అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్య క్షుడు కొల్లి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె శ్రీను, మణికంఠ విజయకుమార్, తేలి శాంతి స్వరూప్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష

ఏలూరు (టూటౌన్): యువతిపై అత్యాచారం చేసిన కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఏలూరు మహిళా కోర్టు ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి శుక్రవారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించి ఆ జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణం రుస్తుంబాద ప్రాంతానికి చెందిన నింది తుడు మిసారపు అశోక్ అనే వ్యక్తి అదే పట్టణం అరుంధతి పేటకు చెందిన ఒక ఆమెను ప్రేమించి పెళ్లిచేసుకుంటానని నమ్మించి ఆమె ఇష్టానికి వ్యతి రేకంగా పలుమార్లు అత్యాచారానికి పాల్పడి గర్భ వతిని చేశాడు. తరువాత ఆమెను పెళ్లి చేసుకో వడానికి నిరాకరించి మోసం చేశాడు. బాధిత యువతి తన తల్లిదండ్రుల ద్వారా పెద్దల సమక్షం లో పెట్టి అడిగించినా నిందితుడు ఒప్పుకోలేదు. దీంతో ఆ యువతి 2021 సంవత్సరం ఫిబ్రవరి 1న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై ఆర్ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేయగా అప్పటి నర్సాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణకు మార్, జి.శ్రీనివాస యాదవ్ దర్యాప్తు చేపట్టి నింది తుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో బాధితురాలి తరఫున ఏపీపీ డీవీ రామాం జనేయులు తన వాదనలు వినిపించారు. మిసా రపు అశోక్ అత్యాచారానికి పాల్పడినట్లు నేరం రుజువుకావడంతో ఏలూరు మహిళా కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి పదేళ్ల కారాగార శిక్ష,, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్ల డించారు.

నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.70.60 లక్షలు టోకరా

నరసాపురం: నరసాపురంలో ఓ మహిళ బంగారం తాకట్టు షాపులో నకిలీ నగలు రెండు దఫాలుగా కుదువపెట్టి రూ.70.60 లక్షలు టోకరా వేసింది. మహిళ తాకట్టు పెట్టిన నగలు గిల్ట్‌వని గుర్తించిన తాకట్టు షాపు యజమాని పోలీసులను ఆశ్రయిం చాడు. దీనికి సంబంధించి టౌన్ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురం పట్టణం సరిపల్లికి చెందిన శరిగినీడి ఉషారాణి అనే మహిళ పట్టణం లోని జేపీ బ్యాంకర్స్ పేరుతో ఉన్న నగలు తాకట్టు షాపులో ఈనెల 20వ తేదీ 81 గ్రాముల నగలు తాకట్టు పెట్టి రూ 3 లక్షలు తీసుకుంది. ఆమె రెండేళ్ల క్రితం 1661 గ్రాములు నగలు తాకట్టు పెట్టి రూ.67.60 లక్షలు తీసుకుంది. తాకట్టు షాపు యజమాని సుముద్‌జైన్‌కు అనుమానం వచ్చి ఆమె కుదువపెట్టిన తాకట్టు నగలు పరీక్షించగా నకిలీవని గుర్తించాడు. దీంతో ఆమెను పిలిచి మాట్లాడగా ఆమె నకిలీ నగలు కుదువపెట్టినట్టు ఒప్పుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే ఉషారాణి ఈనెల 24వ తేదీన కొందరితో కలసి షాపునకు వచ్చి గొడవ చేస్తే చంపేస్తానని బెది రించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఆటో డ్రైవర్‌ను రక్షించిన యువకులు

తాడేపల్లిగూడెం అర్బన్: అకస్మాత్తుగా కాలువలో పడిన ఓ ఆటోడ్రైవర్‌ను యువకులు రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం మండలానికి చెందిన ఆటో డ్రైవర్ శుక్రవారం ఆటోను కడకట్ల వంతెనపై నిలిపి గోదావరి కాలువ మీదుగా ఉన్న వంతెన రెయిలింగ్‌పై కూర్చున్నాడు. కొద్దిసేపటికి హఠాత్తుగా రెయిలింగ్‌పై నుంచి కాలువలోకి పడిపోయాడు. సమీపంలో ఉన్న యువకులు ఆటోడ్రైవర్ పడిపోవడం చూసి వెంటనే కాలువ లోకి దూకి అతనిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఊపిరి ఆడకపోవడంతో ఆటో డ్రైవర్‌ను వైద్యచికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిం చారు. ఆటో డ్రైవర్ వివరాలు తెలియరాలేదు.

మద్యంషాపులో అగ్నిప్రమాదం

భీమవరం: భీమవరం పట్టణ శివారు తాడేరు రోడ్డులోని ప్రభుత్వ మద్యం షాపులో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో అధిక శాతం మద్యం ఆగ్నికి ఆహుతైనట్లు డిపో మేనేజర్ ఆర్ గౌరీశ్వరరావు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సంభవించిదని భావిస్తు న్నామని, మద్యం నష్టం అంచనాలపై వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

ఉద్యోగాల ఆశ చూపి ఘరానా మోసం



బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌జేడీ శోభారాణి

కామవరపుకోట: కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పనిచే స్తున్న ఓ మహిళ ఘరానా మోసానికి పాల్పడింది. ఉద్యో గాలు ఇప్పిస్తానని ఆశ చూపి నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.30 లక్షల వరకు డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసింది. బాధితుల ఫిర్యాదుతో ఈ ఘరానా మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే కామవరపుకోట మండలానికి చెందిన ఓ మహిళ, తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకురా లిగా కాంట్రాక్ట్ విధానంపై పనిచేస్తోంది. గతంలో ఆమె కామవరపుకోట మండలంలోని ఆడమిల్లి గ్రామంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పనిచేసేది. ఆ సమయంలో నిరుద్యోగులైన బంధువులను, స్నేహితు లను, పరిచయస్తులను టార్గెట్ చేసి అదే కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి దగ్గరి నుంచి సుమారు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసింది. తణుకులో కూడా ఇదేవిధంగా డబ్బులు వసూలు చేసింది. ఆ తరువాత కాలం గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడం, ఆమె నుంచి సరిగ్గా సమాధానం రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఇటీవల ఆమెపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి ఈ ఘటనపై గురువారం తణుకు కళాశాలలో విచారణ చేపట్టారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విచారిస్తుండడంతో విషయం తెలుసుకున్న బాధితులు, ఒక్కొక్కరుగా వచ్చి కళాశాలలో ఆందోళన చేపట్టారు. ఆర్‌జేడీ శోభారాణి స్పందిస్తూ సత్వ రమే బాధితులకు న్యాయం చేస్తామని, ఆమెను ఉద్యోగం నుంచి తొలగించామని, ఈ ఘటనపై ఉన్నత అధికారు లకు నివేదిస్తామని బాధితులకు ఆమె హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



ఆకివీడు: గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు భీమవరం రైల్వే పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం స్థానిక సంతపేటకు చెందిన కోట్ల కన్న మనాయుడు (48) శుక్రవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుం డగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. అతను కూలి పనులు చేస్తుం టాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు చెప్పారు.

క్లుప్తంగా

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



కె.సముద్రపుగట్టులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అత్తిలి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కాచి చల్లార్చిన నీటినే తాగాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కె.నాగరాజు సూచించారు. శుక్రవారం అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి మాట్లాడుతూ బాల్యవివాహాలు వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని వివరించారు. బాల్యవివాహాలకు బాధ్యత వహించిన వారికి జైలుశిక్ష పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎస్ దీపికారాణి, పూర్ణగిరి, నవోమి, మహిళా సంరక్షణ అధికారిణి భవాని, ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశావర్కర్లు లక్ష్మి, రమ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీనియర్ సొసైటీ ఖాతాదారులకు సత్కారం



పట్టణంలో ఖాతాదారుల సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఉషా గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సంస్థ చైర్మన్ రంగరాజు, మేనేజింగ్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య హాజరై, సంస్థ కార్యకలాపాలు, అభివృద్ధిని వివరించారు. సంస్థలోని సీనియర్ ఖాతాదారులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. మేనేజర్ ఎం.లోవరాజు పర్యవేక్షించారు. బుచ్చిరెడ్డి, విశ్వనాథరాజు, ఎస్.విశ్వనాథం, గరికపాటి బాపయ్య శర్మ, రెండు వందల మంది ఖాతాదారులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అన్ని వయస్సుల వారు సుగర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని, తరచూ మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా కో–ఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన స్థానిక ఆర్అండ్‌బీ గ్రౌండ్‌లో శుక్రవారం ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ శారీరక వ్యాయామం, ఆహారపు అలవాట్లు, మార్పులు, నడక యోగా వంటివి చేస్తూ సుగర్‌ను నియంత్రించుకోవాలని అన్నారు. సభ్యులు కంచర్ల నరసింహ, మానేపల్లి కిరణ్, అపర్ణప్రసాద్, గాజుల మురళీకృష్ణ, డి.ముఖర్జీ, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, మహిళలను వేధించినా, వారిపై దాడులు చేసిన చట్టరీత్యా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని భీమవరం సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరం మండలం వెంప అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం మిషన్ శక్తి పథకంపై మహిళలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసిన వారిపైనా, సహకరించిన వారిపైనా కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. చిన్నవయస్సులో గర్భం దాల్చడం వల్ల తల్లి, బిడ్డకు ఆరోగ్య పరంగా అనర్థాలే జరుగుతాయని తెలిపారు. మహిళలను వేధించినా, వారిపై దాడులు, అత్యాచారాలకు పాల్పడినా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అనిల్ కుమారి, ఆశా వర్కర్లు, తల్లులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. దిరుసుమర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి కార్యక్రమంలో మహిళా చట్టాలపై సూపర్‌వైజర్ అనిల్‌కుమారి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది డి.దయామణి, ఎ.బేబిరాణి, ఐ.కేశవలక్ష్మి, కె.మీనాక్షి, ఎన్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో బీబీఏ కోర్స్

భీమవరం: స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బీబీఏ కోర్స్ ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. ఉన్నతవిద్యామండలి నుంచి అనుమతి రావడంతోపాటు వెబ్ ఆప్షన్‌లో కూడా ఎస్ఆర్‌కేఆర్‌ను పొందుపర్చినట్టు చెప్పారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి



దువ్వ హైస్కూల్లో కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, విద్యార్థినులు

అత్తిలి: పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం శ్రీదేవి హెచ్చరించారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. శ్రీదేవి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట ప్రకారం నేరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్‌ఆర్‌కే కుమారి, ఎం వెంకటలక్ష్మి, జి.నాగజ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి జానకి పాల్గొన్నారు.

బాలికలను చదివించాలి

తణుకు టౌన్: బాలికలను బాలురతో సమానంగా చదివించాలని, బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తణుకు ఐసీడీఎస్ సీడీపీఓ ఎంబీఎస్ ప్రమోదిని కుమారి కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక 100 రోజుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా తణుకు రూరల్ మండలం దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల పట్ల వివక్షను విడనాడాలని, 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. బాలికల వివాహ వయస్సు, బాలికలు, మహిళలపై వేధింపుల నివారణపై మాట్లాడారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కొండ్రుప్రోలు ఆర్‌బీకేలో మిషన్ శక్తి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి



దర్శిపర్రు హైస్కూల్లో విద్యార్థినులకు మిషన్‌శక్తిపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత

మిషన్ శక్తిపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు రైతు భరోసా కేంద్రం వద్ద మిషన్ శక్తిపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి పాల్గొని ఐపీసీ 1860, భారత న్యాయ సంహిత 2023, సీఆర్‌పీసీ–1973 చట్టాల గురించి వివరించారు. పంచాయతీ కార్యదర్శి వై.హరికిషోర్, వీఆర్వో సురేష్, జీఎంఎస్‌కే ఎస్‌పీఎం ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.లక్ష్మి, బి.సుమలత పాల్గొన్నారు.

దర్శిపర్రులో..

పెంటపాడు: బాల్యవివాహాల నిరోధం, పోక్సో చట్టం,తదితర చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. దర్శిపర్రు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ మిషన్ శక్తిపై బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీల భద్రతకు ఎన్నో చట్టాలు రూపొందించిందన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్, స్త్రీల హెల్ప్‌లైన్, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం తదితర విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

31న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెంటపాడు: పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 31న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులతో పాటు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు పెంట్లమ్మకు ఆషాఢ సారె సమర్పణ

పెంటపాడు: మండలంలోని ఉమామహేశ్వరం గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం గ్రామస్తులు ఆషాఢ సారె సమర్పించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి గ్రామస్తులంతా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారెను సమర్పిస్తామని వివరించారు.

30న ముత్యాలమ్మకు..

పెంటపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఈ నెల 30న ఆషాఢ సారె సమర్పించనున్నట్లు శుక్రవారం ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ఉదయం 8 గంటలకు కోనేరు చెరువుగట్టుకు చేరుకుని ఊరేగింపు ప్రత్యేక పూజలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మానవత మండల సమావేశం

పెంటపాడు: మానవత మండల స్థాయి సమావేశాన్ని ఆదివారం బోడపాడు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో మండల మానవత సంస్థ సభ్యులు తప్పక పాల్గొనాలని కోరారు.

డెంగీ నివారణకు పరిసరాల శుభ్రతే మార్గం

తణుకు అర్బన్: డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పి.శ్రీనివాసరావు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఇంద్రయ్య నగర్‌లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంటి పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు అవసరంలేని నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. దోమ విడిచిన లార్వా దోమగా మారాలంటే సుమారుగా 8 నుంచి 10 రోజుల వ్యవధి ఉంటుందని, ఆ కారణంగా వారానికోసారి డ్రైడేగా పాటించి నీటి నిల్వలను తొలగిస్తే దోమగా మారకుండా లార్వా దశలోనే నిరోధించవచ్చని వివరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చలి జ్వరం, ఒళ్లునొప్పులు వంటి సమస్యలు ఉన్నప్పుడు తక్షణమే సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. డెంగీ కారకమైన ఫీమేల్ టైగర్ దోమ పుట్టుకను నివారించే ఖర్చురహిత మార్గం డ్రైడే ఫ్రైడే ఒక్కటేనని అన్నారు. ముందుగా డెంగీపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ వి.రాజకుమారి, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.



తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏఎంఓ శ్రీనివాసరావు

తేరుకుంటున్న వరి నాట్లు

అత్తిలి: ముంపు నుంచి వరినాట్లు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. శుక్రవారం అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో ముంపుబారిన పడిన వరినాట్లు, నారుమడులను ఆయన పరిశీలించారు. ముంపు నుంచి కోలుకున్న వరికి ఎకరానికి 15 కిలోల యూరియా, 20 కిలోల ఎంఓపీ వేసుకోవాలని సూచించారు. మొక్క నిలదొక్కుకున్న తరువాత 2 గ్రాముల కార్బెండిజమ్, మాంకోజేబ్ మిశ్రమాన్ని పైపాటుగా పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల బెడద తగ్గుతుందని చెప్పారు. రైతులు ప్రస్తుతం స్వల్పకాలిక (120 రోజులు) వరి వంగడాలను వేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రూప, రైతులు పాల్గొన్నారు.



స్కిన్నెరపురంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ రాజేష్

స్వర్ణకార సంఘ సంక్షేమానికి కృషి చేయాలి

తణుకు టౌన్: స్వర్ణకారుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసే వ్యక్తులనే సంఘ బాధ్యులుగా ఎన్నుకోవాలని తణుకు పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాగమల్లి సాంబశివరావు సూచించారు. శుక్రవారం స్థానిక మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన స్వర్ణకారుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణకార సంఘానికి ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థుల తమ మనోభావాలను వివరించి, తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి పోరుమిల్లి సుబ్బారావు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మందారపు నాగ మనోహర్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ మెషీన్ సరఫరాకు టెండర్లు

భీమవరం: తాడేపల్లిగూడెంలోని పురుగు మందుల పరీక్ష ల్యాబ్‌కు అవసరమైన గ్యాస్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ మెషీన్ సరఫరా చేయడానికి స్వల్ప కాలిక టెండర్లకు ఆహ్వానిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బిడ్డర్లు ఇఎండీ రూ.2 లక్షలు ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం లోపుగా డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్స్ చెక్‌ను సమర్పించాలని పేర్కొన్నారు. టెండరు డాక్యుమెంట్లను కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 83310 56658లో సంప్రదించాలని జేసీ పేర్కొన్నారు.

కూలీల వ్యతిరేక బడ్జెట్

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు వ్యతిరేక బడ్జెట్ అని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం రామాలయం వద్ద రైతు సంఘం గ్రామ కమిటీ సమావేశం గురువారం రాత్రి మందపాటి విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను రైతులు, కౌలు రైతులు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించాలని ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి పాలుపూరి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు ముత్తా శివన్నారాయణ, పీలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు

అవకాశాలే అభివృద్ధికి మార్గాలు

ఉండి: అందుబాటులోకి వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటేనే భవిష్యత్తులో అభివృద్ధి సాధించగలమని దివ్య కళాశాల డైరెక్టర్ కె.దుర్గారావు అన్నారు. శుక్రవారం ఉండి దివ్య కళాశాలలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాబ్‌మేళాకు వివిధ జిల్లాల నుంచి 290 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 115 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ దుర్గారావు మాట్లాడుతూ కళాశాలలో జాబ్‌మేళా విజయవంతంగా నిర్వహించామని అన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డిప్లమో, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ అర్హత కలిగిన అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అనేక దిగ్గజ కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకున్నారని అన్నారు. అనంతరం ఎంపికైనవారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే రాంబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టీ సూర్యనారాయణ, లెక్చరర్స్, వివిధ కంపెనీల హెచ్ఆర్‌లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



తాడేపల్లిగూడెంలో క్రీడా జ్యోతి, కవాతు నిర్వహిస్తున్న సీఐలు, టీబీఆర్ సిబ్బంది



పెంటపాడు డీఆర్ గోయంకా కళాశాల వద్ద కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతీవారు గుర్తుంచుకోవాలని మాజీ సైనిక సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకులు తనబుద్ధి భోగేశ్వరరావు పేర్కొన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్‌స్కూల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి తాడేపల్లిగూడెంలోనూ, శుక్రవారం అలంపురం గ్రామంలోనూ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో జరిగిన కార్యక్రమంలో టౌన్, రూరల్ సీఐలు సుబ్రహ్మణ్యం, రమేష్‌లు పాల్గొని కవాతు నిర్వహించగా టీబీఆర్ విద్యార్థులు అనుసరించారు. శుక్రవారం టీబీఆర్ స్కూలు వద్ద ఉన్న జై జవాన్ స్థూపానికి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ భావన, కల్నల్ సుబేదార్ ముఖర్జీ, 19 బెటాలియన్ మేజర్ జనరల్ బీవీ రావు (విశ్రాంత), జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సైనికసంక్షేమ సంఘ సభ్యులు, ఆర్మీ సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ గోయంకా కళాశాలలో..

డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సిబ్బంది ర్యాలీ చేశారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, గంధం వాణి, విక్టర్ ప్రేమ్‌సాగర్, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్గిల్ విజయ దివస్ సందర్భంగా పట్టణంలోని డీఆర్ గోయంకా మహిళా జూనియర్, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణార్థం ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ ముత్తా రామారావు, ఆధ్యాత్మికవేత్త వేమూరి రామమ్‌లు మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగా దేశానికి కలిగే ప్రయోజనాలను విద్యార్థినులకు వెల్లడించారు. ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ గణపతిరామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాధవరంలో..

తాడేపల్లిగూడెం రూరల్: కార్గిల్ శిఖరాల్లో దాగి ఉన్న పాకిస్తాన్ ఉగ్రవాదులను తరిమికొట్టడంలో 527మంది భారత సైన్యం ప్రాణాలర్పించారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీఎస్ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం మాజీ సైనికుల సంక్షేమ భవనం వద్ద కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. గోపిశెట్టి భరతుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాదరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాజీ సైనికుల స్థూపం వద్ద అమరజవాన్లకు జోహార్లు అర్పించారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, మాజీ సర్పంచ్ కవులూరి పరిమళ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లం వీరయ్య, గోపిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

తణుకు: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని కార్గిల్ యుద్ధంలో 23 రోజుల పాటు పైలట్‌గా సేవలందించిన తణుకు పట్టణానికి చెందిన కడించర్ల రాజేశ్వరరావును శుక్రవారం ఘనంగా సత్కరించారు. బీజేపీ, ఆంధ్రా విద్యార్థి సంఘం, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల సమక్షంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాజేశ్వరరావు మాట్లాడారు. నాడు వీరోచిత పోరాటాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో నార్ని తాతాజీ, అయినంపూడి శ్రీదేవి, కందుకూరి పద్మావతి, పెదమల్లు అవినాష్‌కాంత్, చివటం శివ, చీలి రాజు, తేలి సంజయ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



మాధవరంలో జరిగిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాదరావు



తణుకులో రాజేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

బలుసులమ్మకు శాకంబరి అలంకరణ



శాకంబరి అలంకరణలో బలుసులమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరిగా అలంకరించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రవిశంకర్, ఆలయ పర్యవేక్షకులు శ్రీరంగం అంజిబాబు ఆధ్వర్యంలో సుమారు 8 టన్నులతో వివిధ కూరగాయలు, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, నిమ్మకాయలు, ఆకుకూరలు, పండ్లుతో విశేషంగా అలంకరించారు. నీరుల్లి వర్తక సంఘం, విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం తదితర సభ్యులు సహకరించారు. తొలుత వెలవలపల్లి ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, మల్లికార్జున శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. శుక్రవారం సందర్భంగా దాత దాట్ల జగన్నాథరాజు సాయంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పాతూరు యూత్ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

వీడని ముంపు సమస్య

పెంటపాడు: వేలాది ఎకరాలను ముంపు నీరు వదటడం లేదు. వారం గడుస్తున్నా వర్షం నీటిలో మునిగిన వరి నాట్లు తేలడంలేదు. యనమదుర్రు డ్రెయిన్ వల్ల పరివాహక గ్రామాల్లో చొచ్చుకువచ్చిన నీరు అలానే ఉంది. ప్రధానంగా మీనవిల్లూరు, కొండేపాడు, విప్పర్రు, యానాలపల్లి, పరిమెళ్ల, కె. పెంటపాడు, పెంటపాడులో చేలు నీట మునిగాయి. ఇప్పటికీ నాట్లు పైకి కనపడటం లేదని రైతులు బెంబేలెత్తుతున్నారు.